క్లుప్తంగా

నేడు బసవేశ్వరుడి జయంతి

హన్మకొండ కల్చరల్: వీరశైవ లింగాయత్ ధర్మాన్ని ప్రపంచ మానవాళికి ప్రబోధించిన మహాత్మ బసవేశ్వరుడి 890వ జయంతి ఉత్సవాన్ని వీరశైవ లింగాయత్ సంప్రదాయ రీతిలో ఆదివారం నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నానం రాజయ్య, ప్రధాన కార్యదర్శి గుండవరం విధుమౌళి, కోశాధికారి సూరం సురేష్‌బాబు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆదివారం ఉదయం 9గంటలకు వేయిస్తంభాల దేవాలయం నుంచి శ్రీదేవి ఏషియన్ మాల్ వెనుక ఉన్న సాయి బాబా దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దేవాలయ కల్యాణ మండపంలో బసవేశ్వరుని జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి ఆత్మీయఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వీరశైన వింగాయత్, జంగ సమాజం వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అడవులను రక్షిద్దాం.. ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

హన్మకొండ చౌరస్తా: అడవులను రక్షించుకుంటూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీపౌరుడిపై ఉందని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సూచించారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని శనివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, సాగంటి మంజుల, స్వర్ణలత, శోభ, సదానందం, రాజేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



హన్మకొండ: పంచభూతాలను పరిరక్షించుకున్నప్పుడే మానవ మనుగడ కొనసాగుతుందని యోగా గురువు పోశాల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయ యోగా శిక్షణ శిబిరం యోగా సాధకులతో కలిసి పోశాల శ్రీనివాస్‌తో మామిడి మొక్కను శనివారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. రాబోయే తరానికి దిక్సూచిలా నిలబడాలని చెప్పారు.

బీబీసీ చర్చిలో ఉమెన్ రిట్రీట్



సోదా కిరణ్‌ను సన్మానిస్తున్న మహిళలు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 53వ డివిజన్ లష్కర్ సింగారం బీబీసీ చర్చిలో శనివారం ఉమెన్ రిట్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సోదా కిరణ్ పాల్గొన్నారు. ఈమేరకు ఆయనను మహిళలు, చర్చి పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో చర్చి సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాకేష్‌రెడ్డి

హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని, ఈక్రమంలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, బీజేపీ 51వ డివిజన్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, శ్రీనిధి పాఠశాలల కరస్పాండెంట్ నితిన్, రాజేందర్ రెడ్డి, అనిల్, వెంకటేష్, పద్మజ, ఓంకార్ శివకుమార్, అశోక్, తిరుపతి రెడ్డి, రేవంత్, అఖిల్ పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో ఈద్ మిలాప్

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ కడిపికొండ బ్రిడ్జి వద్ద ఎం–సేవా మైనార్టీస్ సోషల్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈద్ – మిలాప్ నిర్వహించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సై శ్వేత, ఎం – సేవా ప్రెసిడెంట్ సయ్యద్ పాల్గొని ప్రజలకు షీర్ కురుమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ.యూనిస్, సోని, షఫీ, సత్తర్, దస్తగిరి, ఇబ్రహీం పాల్గొన్నారు.


ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

రంజాన్ పర్వదినాన్ని నగరవ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం అలయ్ బలయ్ తీసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పెద్దమ్మగడ్డ ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న కార్పొరేటర్ అశోక్‌యాదవ్



మడికొండలోని మసీదులో..



కాజీపేట ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిలు



హసన్‌పర్తిలో రంజాన్ వేడుకలు



6వ డివిజన్‌లో..



హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. ఈమేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. పరిశోధక విద్యార్థుల హాస్టల్ వద్ద సీసీ రోడ్డు, వాహనాల పార్కింగ్‌కు షెడ్డు నిర్మించాలని, లైబ్రరీలో వద్ద కనీస సదపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కె.ప్రశాంత్, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, కేయూ జేఏసీ బాధ్యులు చెల్పూరి శ్రీకాంత్, తాళ్లపెల్లి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'జేవీవీ' వేసవి శిబిరం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఈనెల 24 నుంచి మూడ్రోజులపాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తామని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ కేబీ.ధర్మప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాల కోసం 99897 32423 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పీడిత ప్రజల విముక్తికి పోరాటం

ఖిలా వరంగల్: భూస్వామ్య, దళారీ వ్యవస్థ, సామ్రాజ్యవాదం, నిరంకుశ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా పీడిత ప్రజల విముక్తి కోసం ప్రజా పోరాటాలు చేయాలని సీపీఐ (ఎంఎల్) నేతలు గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రష్యా విప్లవ నేత లెనిన్ జయంతి సందర్భంగా ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడు బాలరాజు ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా హిందూ మతోన్మాద, ఫాసిస్టు పాలన చేస్తూ రాజ్యాంగంలోని పౌర ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు గంధ్రాతి హరిబాబు, ఆర్.కృష్ణ, మైదం సంజీవ, ఎండీ.అక్బర్, ఇనుమల కృష్ణ, కుమారస్వామి, పాపయ్య, సాంబయ్య, గన్నారపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

1,111 తమలపాకులతో ఆంజనేయుడికి పూజలు



పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారులు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో దక్షిణముఖ ఆంజనేయస్వామికి హనుమాన్ మాలధారులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం 1,111 తమలపాకులతో అలంకరించి పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, అర్చకులు ఆరుట్ల కృష్ణామాచార్యులు, విక్కీ, సమ్మయ్య, రవికుమార్, భాస్కర్, మల్లేశం, రమేష్, సృజన, తదితరులు పాల్గొన్నారు.

పరశురాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



పరశురాముడి చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఉపేంద్రశర్మ, సేవా సమితి సభ్యులు

హన్మకొండ కల్చరల్: పరశురాముడిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో జరుగుతున్న అన్యాయాలను సంఘటితంగా ఎదుర్కోవాలని బ్రాహ్మణసేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ సూచించారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణభవన్‌లో పరశురామ జయంతిని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పరశురాముడి చిత్రపటానికి పూలమాలలు వేసి పురుషసూక్త విధానంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉపేంద్రశర్మ మాట్లాడుతూ పరశురామ జయంతిని బ్రాహ్మణులకు దళితులకు మధ్య సాంస్కృతిక వారధిగా జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పరశురామ దళం ఏర్పాటు చేశారు. దళం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మరింగంటి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో 200మంది బ్రాహ్మణ యువకులు పాల్గొని సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వేముగంటి సుధాకరశర్మ, గంగు మణికంఠ శర్మ, మేఘశ్యామ్, సూరజ్‌కృష్ణ, వెన్నం జయంత్ తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు సేమియా పంపిణీ



కాజీపేటలో సేమియా పంపిణీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్



వరంగల్ చౌరస్తా: దయానంద కాలనీలో..

కాజీపేట: కాజీపేట జమా మసీదు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి పీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేమియా పంపిణీ కేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు ప్రారంభించారు. రంజాన్ వేడుకలను పురస్కరించుకుని బాటసారులకు సేమియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సర్వర్, బెదరకోట రంజిత్, ఎండీ.సోని, నాగవెల్లి శ్రీధర్, మహమూద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దయానందకాలనీలో..

వరంగల్ చౌరస్తా: రంజాన్ పర్వదినం సందర్భంగా వరంగల్ వెంకట్రామా జంక్షన్ దయానంద కాలనీలో సేమియా, పాయసాన్ని టీపీసీసీ కార్యదర్శి, దయానంద కాలనీ కమిటీ అభివృద్ధి అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ శనివారం పంపిణీ చేశారు. అనంతరం, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు సులేమాన్, ఎజాజ్ అహ్మద్, అల్తాస్, సమీర్, కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, రవికుమార్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లాదెల్ల రామకృష్ణ, కోశాధికారి రవికుమార్, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల అందజేత



కాశిబుగ్గ: నిత్యావసరాలు అందజేస్తున్న సభ్యులు



వరంగల్ చౌరస్తా: పిన్నావారి వీధిలో..

కాశిబుగ్గ: రంజాన్ పండుగను పురస్కరించుకుని జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు శనివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 19వ డివిజన్ గాంధీనగర్‌లో పేదలకు 9రకాల వస్తువులతో కూడిన నిత్యావసర సరుకులను హైకోర్ట్ అడ్వకేట్ పోలెపాక చంద్రకళ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీపండుగకు తమవంతుగా పేదలకు వస్తువులను అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.రహీంఖాన్, సందెల లాజర్, అలెగ్జాండర్, జోషి, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో..

వరంగల్ చౌరస్తా: వరంగల్ 28వ డివిజన్‌లో ముస్లింలకు రంజాన్ కానుకలను స్థానిక కార్పొరేటర్ గందె కల్పన, నవీన్ కుమార్ దంపతులు శనివారం పంపిణీ చేశారు. తమ సొంత ఖర్చుతో దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమికి రమేష్ బాబు బీఆర్ఎస్ నాయకులు కొలిపాక శ్రీనాథ్, బోయిని రవి, కళ్యాణ్, దయాసాగర్, గజ్జల శ్రవణ్, రాజు పాల్గొన్నారు.

కాజీపేటలో కన్నీటి కష్టాలు

- తీవ్రమైన నీటి ఎద్దడి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- చర్యలు చేపట్టని అధికారులు



ఏఆర్‌ఆర్‌నగర్ కాలనీలో నీళ్ల కోసం తండ్లాడుతున్న జనం



విష్ణుపురిలో లీకేజీ అయిన పైపులైన్

కాజీపేట: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేయకపోవడంతో కాజీపేట పట్టణ ప్రజలు ప్రతిరోజు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో పట్టణంలోని మూడు ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించినా సరిపడా తాగునీటిని సరఫరాలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. శివారు కాలనీలు, ఎగువ ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణంలో అడుగడుగునా పైపులైన్‌ల లీకేజీ, గేట్‌వాల్వ్‌ల లీకేజీలను అరికట్టకపోవడంతో తాగునీటి వృథా నిత్యకృత్యంగా మారింది. పట్టణానికి వలసలు, పట్టణీకరణ ప్రభావం వల్ల కాజీపేట పట్టణంలో జనాభా రెండు, మూడు రెట్లు అధికమైంది. ఆ నిష్పత్తిలో నీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొత్తగా వెలిసిన సుమారు 50 కాలనీలు, శివారు ప్రాంతాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి తీవ్రమైంది.

నిధులున్నా పనులు నామమాత్రమే..

కార్పొరేషన్‌లో సరిపడా నిధులు ఉన్నప్పటికీ నూతన కాలనీలకు తాగునీటిని అందించేందుకు పైపులైన్లు వేసి తదనుగుణంగా చర్యలు చేపట్టడం లేదు. పైపులైన్ లేని ప్రాంతాల్లో పరిస్థితి మరోలా ఉంది. మున్సిపల్ అధికారులు ఒక ఇంటికి సరిపడా నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలో అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి నీరు అందడం లేదు. జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కనెక్షన్లు.. మోటార్ల అనధికార వాడకం

ధర్మసాగర్ రిజర్వాయర్ నిండా సరిపడా నీరు ఉన్నా కనీస అవసరాలు తీరడం లేదు. విష్ణుపురి, డీజిల్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు కాజీపేట పట్టణానికి పెద్ద దిక్కుగా మారాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా పట్టణంలో దాదాపు 750 అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు అధికారుల అంచనా. అనేక ఇళ్లల్లో విద్యుత్ మోటార్లతో తాగునీటిని అక్రమంగా వాడుకుంటున్నారు. దాంతో అందరికీ సరిపడా నీటి అందడం లేదు. ఈక్రమంలో ఎగువ ప్రాంతాలు, నూతన కాలనీలకు పైపులైన్లను విస్తరించాలి. పట్టణంలో అధికంగా ఉన్న లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలి. ఇళ్లలో అనధికారికంగా ఉపయోగిస్తున్న కరెంటు మోటార్లను తొలగించాలి. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

వారానికి ఒకటి, రెండుసార్లు నల్లా నీరు



ప్రజల తాగునీటి అవసరాలకు సరిపడా తాగునీరు నల్లాల ద్వారా సరఫరా కావడం లేదు. వారంలో నాలుగైదు రోజుల కోమారు వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస అవసరాలకు కూడా సరిపోకపోవడంతో చేతిపంపుల మీద ఆధారపడి జీవిస్తున్నాం. అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు.

– బోయిని కుమార్‌యాదవ్, సోమిడి

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

సకాలంలో తాగునీటిని పట్టణంలో సరఫరా చేయడానికి చర్యలు చేపడుతూనే ఉన్నాం. లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి. అనవసరంగా వృథా చేయొద్దు.

– పాక వెంకటేశ్వర్లు, ఏఈ, కార్పొరేషన్

అన్నదాతల ఎదురుచూపులు

హసన్‌పర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు మండలంలో 80శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. కల్లాలతో పాటు ప్రధాన రహదారులపై వరి ధాన్యాన్ని ఆరబోశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, మరోవైపు వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు



కల్లాల వద్ద ధాన్యం కుప్పలు



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం